
సాక్షి
బాపట్ల
గురువారం । 27 । జూలై । 2023



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ నీటిమట్టం బుధవారం 515.80 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 5,088 క్యూసెక్కులు విడుదలవుతోంది.



ఆలయ హుండీ కానుకల లెక్కింపు

వినుకొండ(నూజెండ్ల): స్థానిక వేంకటేశ్వర స్వామి దేవస్థానం హుండీ కానుకలు బుధవారం లెక్కించారు. రూ.3,18,102 వచ్చినట్లు పర్యవేక్షణ అధికారి మంజూష తెలిపారు.

స్వాతి నక్షత్ర పూజలు



గుంటూరు రూరల్: మండలంలోని వెంగ ళాయపాలెంలోని స్వయంభు పుష్పాద్రి రాజలక్ష్మి గోదాదేవి లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో బుధవారం స్వాతి నక్షత్ర ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజలు, అభిషేకాలు, హోమం నిర్వహించారు.

న్యూస్‌రీల్

రూ.10,421 కోట్ల విలువైన మిర్చి ఎగుమతి



గుంటూరు మెడికల్: భారతదేశం నుంచి వివిధ దేశాలకు 2022–23 ఆర్థిక సంవత్సరంలో ఎగుమతి చేసిన మిర్చి విలువ రూ.10,421 కోట్లు ఉంటుందని చిల్లీస్ ఎక్స్‌పోర్టర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శి తోటా రామకృష్ణ బుధవారం తెలిపారు. గత ఏడాదితో పోలిస్తే రూ.1,861 కోట్లు ఎక్కువని పేర్కొన్నారు. మొట్టమొదటిసారిగా అధిక మొత్తంలో విదేశాలకు మిర్చి ఎగుమతి చేయడంపై అసోసియేషన్ తరఫున హర్షం వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీకి, మిర్చి రైతులకు, ఎక్స్‌పోర్టర్లకు ధన్యవాదాలు తెలిపారు.

30లోగా ప్రశస్త యాప్‌లో పేర్లు నమోదు చేసుకోవాలి

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఒకటి నుంచి 18 సంవత్సరాల లోపు 21 రకాలైన దివ్యాంగ బాలబాలికలు తమ పేర్లను ప్రశస్త యాప్‌లో నమోదు చేసుకోవాలని గుంటూరు తూర్పు విద్యాశాఖ అధికారి వెంకటేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దివ్యాంగులకు అవసరమైన ఉపకరణాలు, ఉపాధి అవకాశాలు కల్పించడానికి ప్రతి ఒక్క దివ్యాంగుడు ఈ నెల 30వ తేదీ లోగా పేర్లు విధిగా నమోదు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 9989085102, 7989561730లో సంప్రదించాలని కోరారు.

భారీ కొండచిలువ కలకలం



మంగళగిరి: నగరంలోని గండాలయపేటలో ఓ భారీ కొండచిలువ కలకలం సృష్టించింది. బుధవారం ఉదయం నుంచి వర్షం జోరుగా కురుస్తుండటంతో జనం అంతా ఇళ్లకే పరిమితమయ్యారు. ఈ సమయంలో కొండ చిలువ ఓ ఇంట్లోకి వెళుతుండగా అక్కడే ఉన్న పెంపుడు కుక్క అరిచింది. దీంతో ఆ ఇంట్లోని వారు బయటకు వచ్చి కొండ చిలువను గమనించారు. వెంటనే కొందరు యువకులు కొండ చిలువను కర్రలతో కొట్టి చంపడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు.

యార్డులో 30,922 బస్తాల మిర్చి విక్రయం



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 30,687 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 30,922 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.24,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.25,000 వరకు పలికింది. ఏసీ కామన్ రకం మిర్చి క్వింటాలుకు రూ.12,500 నుంచి 23,500 వరకు ధర లభించింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.14,000 నుంచి రూ. 25,500 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.14,500 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 9,880 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

29న జిల్లా స్థాయి సబ్ జూనియర్ ఫుట్‌బాల్ పోటీలు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాలబాలికల సబ్ జూనియర్ ఫుట్‌బాల్ పోటీలు నిర్వహిస్తామని అసోసియేషన్ అధ్యక్షుడు కుమ్మరి క్రాంతి కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలను ఈ నెల 29వ తేదీన మేడికొండూరు మండలం, కొర్రపాడు గ్రామంలోని జెడ్పీ హైస్కూల్లో ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతిభ కనబరిచిన చిన్నారులను ఎంపిక చేసి రాష్ట్ర పోటీలకు పంపిస్తామన్నారు. 2010, 2011 తర్వాత పుట్టిన వారు పోటీల్లో పాల్గొనే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 99595 37355 నంబరును సంప్రదించాలని సూచించారు.

గగనాన ముసిరింది..

గగనాన మేఘం ముసిరింది.. నిండా మేఘం కమ్మి.. జల్లుజల్లుగా వర్షంకురుస్తోంది.. ఎన్ని యుగాలని తడిపిందో ఈ వాన.. ఎన్ని జాతుల విత్తనాలను మొలకెత్తింపజేసిందో ఈ వాన.. వేలాది ఎకరాలకు పచ్చపచ్చని సారం.. జిల్లాలో మూడు రోజులుగా విస్తారంగా వర్షాలు పడుతున్నాయి. ఇప్పటికే డెల్టా ప్రాంతంలో ఖరీఫ్ నాట్లు ప్రారంభమయ్యాయి. రైతులు వెద పద్ధతిలో సాగు చేపట్టారు. పొలాల్లో నీరు చేరినప్పటికి నష్టం లేదని రైతులు చెబుతున్నారు.



కొల్లూరు శివారు బోసునగర్ వద్ద వర్షపు నీట మునిగిన వెద పద్ధతిలో సాగు చేసిన వరి పైరు

ఎడతెరిపిలేని వర్షం

- బాపట్లలో తిమ్మరాజు చానల్‌కు గండి
- వేమూరులో పంటపొలాల్లోకి చేరిన నీరు
- వరి సాగుకు అనుకూలం
- దెబ్బతిన్న ఆకుకూరలు

బాపట్ల: జిల్లాలో కొన్ని రోజులుగా విస్తరంగా వర్షాలు కురుస్తున్నాయి. లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ముఖ్యంగా వేమూరు నియోజకవర్గంలో పొలాలు నీటమునిగాయి. 95వేల ఎకరాల్లో వెద సాగు చేపట్టాల్సి ఉంది. ఇప్పటికే 60 వేల ఎకరాలకుపైగా వెద సాగు చేశారు. వేమూరు, కొల్లూరు, క్రాప, అమృతలూరు గ్రామాల పరిధిలో పంటపొలాల్లోకి నీరు చేరింది. చీరాల నియోజకవర్గంలో వర్షాలతో లోతట్టు మగ్గాల్లోకి నీరు వచ్చి చేరింది. తోటవారిపాలెంలో కొంతమంది నేత కార్మికులు ఇబ్బందులుపడ్డారు. రేపల్లె నియోజకవర్గంలోని చెరుకుపల్లి, రేపల్లె ప్రాంతంలోని వంద ఎకరాల్లోకి వెద పెట్టిన పొలాల్లోకి వర్షం నీరు వచ్చి చేరింది. అద్దంకి నియోజకవర్గంలోని సంతమాగులూరు, బల్లికూరవ, కోరిశపాడు మండలంలోని పి.గుడిపాడులోని ఆకు కూర పైర్లు స్వల్పంగా దెబ్బతిన్నట్లు రైతులు చెబుతున్నారు.

కొల్లూరు: మండలంలో మంగళవారం నుంచి బుధవారం సాయంత్రం వరకు ఏకదాటిగా వర్షం కురుస్తూనే ఉంది. పంట పొలాలతో పాటు, మరో పక్క లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వెద పద్ధతిలో వరి సాగు చేపట్టారు. కొంత మేర నీటమునిగాయి. కొల్లూరు ఎస్సీ కాలనీ, ఆలపాటినగరం, మగ్గాలపాలెం తదితర గ్రామాలలో ఇళ్ల చుట్టూ వర్షం నీరు చేరింది.



కొల్లూరు ఐటీఐ కళాశాలలోకి చేరిన వర్షం నీరు

వర్షపాతం ఇలా..

బాపట్ల జిల్లాలో అత్యధిక వర్షపాతం కొల్లూరు మండలంలో 38.4 మిల్లీమీటర్లు నమోదు కాగా అత్యల్పంగా కొరిశపాడు మండలంలో 5.2 మి.మీ. నమోదైంది. జిల్లా వ్యాప్తతంగా చూస్తే చుండూరు మండలంలో 27 మి.మీ. అమృతలూరులో 29.6, వేమూరు 7.4, కొల్లూరులో 38.4, భట్టిప్రోలులో 29.2, చెరుకుపల్లిలో 28.2, పిట్టలవానిపాలెంలో 30.2, కర్లపాలెంలో 37.2, బాపట్లలో 36.8, నిజాంపట్నంలో 35.6, నగరంలో 22.6, రేపల్లెలో 33.2, సంతమాగులూరులో 22.8, బల్లికురవలో 5.8, మార్టూరులో 12.4, యద్దనపూడిలో 13.4, పర్చూరులో 20.4, కారంచేడులో 17.2, ఇంకొల్లులో 13.2, పంగులూరులో 13.2, అద్దంకిలో 14.6, చీరాలలో 20.8, వేటపాలెంలో 15.2, చినగంజాంలో 18.8 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది.

పీటీ చానల్‌కు భారీ గండి

బాపట్ల: బాపట్ల మండలంలోని జిల్లెళ్లమూడి గ్రామం సమీపంలోని పీటీ చానల్‌కు భారీ గండిపడింది. చానల్ ఎడమ కట్టకు 3.492 కిలోమీటరు వద్ద గండిపడింది. పూడ్చే పనులు ప్రారంభించాలని ఎమ్మెల్యే కోన రఘుపతి, ఇరిగేషన్ అధికారులకు సూచించారు. గండిపడటంతో చానల్‌లోని నీరు వృథాగా సముద్రంపాలుకాకుండా చూడాలని కోరారు. గండిపూడ్చేందుకు ఏర్పాట్లు చేశారు.



తిమ్మరాజుకాలువకు పడిన గండి



గాజుల్లంక వద్ద కృష్ణా నదిలో ప్రవహిస్తున్న వరద నీరు

కడలి వైపునకు కృష్ణమ్మ

కొల్లూరు: వర్షాల ప్రభావంతో ప్రకాశం బ్యారేజీకు వచ్చి చేరుతున్న నీటిని దిగువకు విడుదల చేస్తుండటంతో కృష్ణమ్మ కడలి వైపు పయనమయింది. నుంచి బుధవారం ప్రకాశం బ్యారేజ్ 40 గేట్లను తెరచి 73 వేల క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. రెండు రోజుల క్రితం విడుదల చేసిన 3 వేల క్యూసెక్కులు దిగువకు విడుదల చేయడంతో కృష్ణా జిల్లా శ్రీకాకుళం వద్ద నదిలో రాకపోకలకు ఏర్పాటు చేసిన ప్రైవేటు గాలుమార్గం కోతకు గురైంది. గాజుల్లంక సమీపంలో గాలుమార్గానికి గండ్లు ఏర్పడ్డాయి. దీనితో ఇరు జిల్లాల మధ్య రాకపోకలు సాగించడానికి ప్రయాణికులను పడవలను వినియోగించడంతోపాటు, వాహనదారులు పులిగడ్డ వారధి నుంచి ప్రయాణం సాగిస్తున్నారు.

పంటలకు నష్టం లేదు

జిల్లాలో కురుస్తున్న వర్షాలతో రైతులకు మేలు. వేమూరులో వెద పద్ధతి పడిన నాట్లుకు కొద్దిమేర నష్టం జరిగే అవకాశం ఉంది. ఇంకా జిల్లాలో ఎక్కడ పంట పొలాల్లో పైరు లేకపోవటంతో నష్టం లేదు. రైతులకు దుక్కులకు కూడా ఈ వర్షాలు ఎంతో మేలు.

–అబ్దుల్‌సత్తార్,
జిల్లా వ్యవసాయాధికారి

రైల్వే కోర్టులో క్లెయిమ్స్ ట్రిబ్యునల్ అదాలత్

- 3 రోజుల్లో 54 కేసులకు పరిష్కారం
- బాధితులకు రూ.4.5 కోట్ల పరిహారం
- రైల్వే డీఆర్‌ఎం రామకృష్ణ వెల్లడి



మాట్లాడుతున్న డీఆర్‌ఎం రామకృష్ణ, చిత్రంలో సీనియర్ డీసీఎం దినేష్‌కుమార్

లక్ష్మీపురం: గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో పెండింగ్ కేసుల దృష్ట్యా లోక్ అదాలత్ నిర్వహించాలని, రైల్వే క్లెయిమ్స్ ట్రిబ్యునల్ అమరావతి బెంచ్ ప్రతిపాదించడం జరిగిందని గుంటూరు రైల్వే డీఆర్‌ఎం ఎం.రామకృష్ణ చెప్పారు. స్థానిక అరండల్‌పేటలోని గుంటూరు రైల్వే కోర్టులో బుధవారం లోక్ అదాలత్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 24వ తేదీ నుంచి 26వ తేదీ వరకు 54 కేసులను అదాలత్‌లో పరిష్కరించామన్నారు. లోక్‌అదాలత్‌ల ద్వారా పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించడంతోపాటు బాధితులకు వారి కుటుంబ సభ్యులకు వేగవంతంగా పరిహారం అందిస్తామన్నారు. 54 కేసులకు గాను రూ.4.5 కోట్ల పరిహారం త్వరలో విడుదల చేయడం జరుగుతుదన్నారు. ఈ లోక్ అదాలత్‌లో న్యాయశాఖ సభ్యుడు జ్ఞాన్ ప్రకాష్ తివారి, టెక్నికల్ విభాగం సభ్యుడు జి.జాన్‌ప్రసాద్, దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ చీఫ్ క్లెయిమ్స్ అధికారి బి.ఎస్.క్రిస్టఫర్, సీనియర్ డీసీఎం ఎం.దినేష్‌కుమార్, డివిజనల్ సీసీఎం క్లెయిమ్స్ బి.డి.క్రిస్టఫర్, డిప్యూటీ సీసీఎం అనుషా యాదవ్, గుంటూరు డీసీఎం, ప్రైజెంటింగ్ అధికారి కె.కమలాకరబాబు బాధితులు, డివిజన్ అధికారులు పాల్గొన్నారు.

‘జగనన్న’ స్ఫూర్తితో సమగ్రాభివృద్ధి

- ఈనెల 31 నాటికి 10 వేల గృహాలు పూర్తి
- ‘జగనన్న సురక్ష’లో 4 లక్షల సర్టిఫికెట్లు అందజేత
- ఉపాధి హామీలో వంద శాతం లక్ష్యం
- ఆగస్టు నుంచి జిల్లాలో గ్రామదర్శిని
- ‘సాక్షి’తో జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా



జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా

సాక్షి ఇంటర్వ్యూ

సాక్షి ప్రతినిధి, బాపట్ల: జిల్లా సమగ్రాభివృద్ధికి ‘జగనన్న’ స్ఫూర్తి.. జిల్లాలో ఉన్న సహజ వనరులను వినియోగించుకుంటూ.. సమగ్ర ప్రణాళిక రూపొందిస్తున్నాం.. జిల్లాలో సుదూర తీరప్రాంతం .. విదేశాలకు ఎగుమతి స్థాయిలో గ్రానైట్ పరిశ్రమ.. విద్యారంగానికి ప్రత్యేక గుర్తింపు ఇలా.. అన్ని రంగాలను సమన్వయం చేస్తున్నాం.. వీటితో పాటు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవతో మెడికల్ కళాశాల నిర్మాణంతో మంచి గుర్తింపు వచ్చింది.. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేసి రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిపినట్లు జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా తెలిపారు. బుధవారం ఆయన ‘సాక్షి’తో మాట్లాడారు.

• పేదల ‘గూడు’

జిల్లాలో పేదల గృహ నిర్మాణానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నాం. జిల్లాలో 31 వేల గృహాలు మంజూరు చేశాం. గడిచిన మూడు నెలల్లో ఇంటి నిర్మాణ పనులు వేగవంతం చేశాం. జూలై 31 నాటికి 10 వేలు గృహాలు పూర్తి చేస్తాం. రాష్ట్రంలో జిల్లా 3వ స్థానంలో ఉంది. వివిధ దశల్లో ఉన్న మిగిలిన గృహాలను త్వరలోనే పూర్తి చేసేందుకు చర్యలు తీసుకున్నాం.

• వాడవాడలా ‘జగనన్న సురక్ష’

జగనన్న సురక్షను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నాం. అన్ని గ్రామాల్లో నిర్వహించే విధంగా ప్రణాళిక అమలు చేస్తున్నాం. ఇప్పటి వరకు 4 లక్షల సర్టిఫికెట్లు మంజూరు చేశాం. సర్టిఫికెట్ల మంజూరులో రాష్ట్రంలో 3వ స్థానంలో ఉన్నాం.

• భవనాల నిర్మాణం ఇలా..

ప్రయారిటీ బిల్డింగ్స్ కార్యక్రమంలో భాగంగా సచివాలయాలు, హెల్త్ క్లీనిక్, రైతు భరోసా భవనాల నిర్మాణ పనులు శరవేగంగా చేపట్టాం. ఫినిషింగ్ దశలో ఉన్న అన్ని భవనాలను జూలై చివరి నాటికి పూర్తి చేస్తాం. రూఫ్ లెవల్ ఉన్న భవనాలను సెప్టెంబర్ 15 నాటికి పూర్తి చేస్తాం. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంజూరు చేసిన రూ.20 లక్షల పనులు త్వరలోనే మొదలుపెట్టి వేగంగా పూర్తి చేస్తాం.

• టేక్ హోం రైస్..

అంగన్‌వాడీల పరిధిలో టేక్ హోం రైస్ కార్యక్రమాన్ని వచ్చే నెల నుంచి ప్రారంభించనున్నాం. దీనికి సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. జిల్లాలో పది, ఇంటర్ ఫెయిల్ అయిన విద్యార్థులను తిరిగి కళాశాలలో చేర్పించేందుకు చర్యలు చేపట్టాం.

▶ ఉపాధికి ఢోకా లేదు..

జిల్లాలో ఉపాధిహామీ పథకం నూరు శాతం లక్ష్యం సాధించాం. ఓ వైపు అభివృద్ధి పనులతో పాటు ఉపాధి హామీ కూలీలకు పెద్ద ఎత్తున పనులు కల్పిస్తున్నాం. ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో 500 ఎకరాల్లో మొక్కలు నాటడమే లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటికే 450 ఎకరాల్లో గుంతలు తీయడం పూర్తి చేశాం. రాష్ట్రంలో జిల్లా మొదటి స్థానంలో ఉంది.

▶ దశ తిరగనుంది..

జిల్లాలో టూరిజం అభివృద్ధితో భావపురి దశ తిరగనుంది. ఇప్పటికే ఏడు ప్రాంతాలను గుర్తించాం. స్థలాలను పర్యాటక శాఖకు ఇచ్చేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు చేశాం. అనుమతులు రాగానే పర్యాటక శాఖకు అభివృద్ధి పనుల బాధ్యత అప్పగిస్తాం.

▶ ఫ్యామిలీ డాక్టర్‌తో మేలు..

జిల్లాలో ఫ్యామిలీ డాక్టర్‌తో పేదలకు భరోసా వచ్చింది. హైపర్ టెన్షన్, డయాబెటిస్, ఇతర వ్యాధులపైన వైద్యసేవలు అందిస్తున్నాం. వైద్య సేవలను ప్రజలు వినియోగించుకుంటున్నారు. దీంతో జిల్లా రాష్ట్రంలో 3వ స్థానంలో ఉంది.

▶ మెడికల్ కళాశాల పనులు..

వైద్య, ఆరోగ్య విభాగం పరిధిలో పీహెచ్‌సీల అభివృద్ధి పనులు చేపట్టాం. ఇప్పటికే కొన్ని పనులు పూర్తికాక, మిగిలిన పనులు టెండర్ల దశలో ఉన్నాయి. మెడికల్ కళాశాల పనులు శరవేగంగా సాగుతున్నాయి. 2025 నాటికి మెడికల్ కళాశాల ప్రారంభం అవుతుంది.

▶ స్పందనకు ప్రాధాన్యం..

స్పందన వినతుల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నాం. సమస్యలను మొక్కుబడిగా కాకుండా పూర్తి స్థాయిలో పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాం. అందు కోసం మూడు స్థాయిల్లో టీమ్‌లను ఏర్పాటు చేశాం. పై స్థాయి అధికారుల పర్యవేక్షణ ఉంది. జిల్లాలో రీసర్వే మొదటి దశ ముగిసింది. రెండో దశలో 21 గ్రామాల్లో సర్వే వేగవంతంగా జరుగుతుంది. ఆగస్టు చివరినాటికి 2వ దశ రీసర్వే పూర్తి చేస్తాం.

ఆగస్టు నుంచి గ్రామదర్శిని..

జిల్లాలో గ్రామదర్శిని కార్యక్రమాన్ని ఆగస్టు నుంచి నిర్వహించనున్నాం. కార్యక్రమంలో భాగంగా 70 మంది స్పెషల్ ఆఫీసర్లను నియమించాం. వారు గ్రామాలను సందర్శించనున్నారు. ప్రత్యేక యాప్, 6 చెక్ లిస్ట్‌లు ఏర్పాటు చేసుకొని గ్రామాలలోని సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరించనున్నాం. ఇప్పటికే సిబ్బందికి శిక్షణ ఇచ్చాం.

సురక్షలో అగ్రస్థానం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా, జేసీ శ్రీధర్

- జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా
- హౌసింగ్ డీఈలకు షోకాజ్ నోటీస్‌లు
- చుండూరు ఇంజినీరింగ్ అసిస్టెంట్ సస్పెన్షన్

బాపట్ల: ‘జగనన్న సురక్ష’ కార్యక్రమాలలో బాపట్ల జిల్లా రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచిందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. గృహ నిర్మాణాలు, గడప గడపకు మన ప్రభుత్వం, నాడు–నేడు పనులు, జగనన్న సురక్ష, భూముల రీ సర్వే పనులపై కలెక్టరేట్ నుంచి బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జగనన్న సురక్ష కార్యక్రమాలలో భాగంగా బాపట్ల జిల్లాలో నాలుగు లక్షల సర్టిఫికెట్లను ప్రజలకు ఉచితంగా పంపిణీ చేశామని చెప్పారు. సర్టిఫికెట్ల జారీపై రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి జిల్లా యంత్రాంగానికి ముఖ్యంగా వలంటీర్లకు ప్రత్యేకంగా ప్రశంసలు అందాయని వివరించారు.

హౌసింగ్ డీఈలకు షోకాజ్ నోటీసులు..

జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలు సత్వరమే పూర్తి చేయాలని కలెక్టర్ కోరారు. రేపల్లె డివిజన్ పరిధిలో పురోగతి తక్కువగా ఉన్నాయని చెప్పారు. వేమూరు, బాపట్ల గృహ నిర్మాణ శాఖ డీఈలు, చుండూరు ఎంపీడీఓకు షోకాజ్ నోటీస్ జారీ చేయాలని సిబ్బందిని కోరారు. చుండూరు మండలంలోని గ్రామ సచివాలయం ఇంజినీరింగ్ అసిస్టెంట్‌ను సస్పెండ్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. తహసీల్దార్, ఎంపీడీఓలు కలెక్టర్ అనుమతి లేకుండా సెలవులు పెట్టరాదని స్పష్టం చేశారు. ఆగస్టు 15వ తేదీలోగా నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని చెప్పారు.

నాడు–నేడు పనులు పూర్తి చేయాలి..

నాడు–నేడు పాఠశాలల అభివృద్ధి పనులు సత్వరమే పూర్తి చేయాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా కోరారు. రెండు రోజుల క్రితమే రూ.31 కోట్ల నిధులు ప్రభుత్వం విడుదల చేసినట్లు చెప్పారు. ఈనెల 28వ తేదీన చేపట్టిన గ్రీన్ బాపట్ల కార్యక్రమంతో రెండు లక్షల మొక్కలను జిల్లాలో నాటాలన్నారు. జిల్లా సంయుక్త కలెక్టర్ సిహెచ్.శ్రీధర్ మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం పనులు జిల్లాలో 320 గ్రామ సచివాలయాల పరిధిలో ప్రారంభమయ్యాయన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.లక్ష్మీశివజ్యోతి, ఆర్డీఓలు జి.రవీందర్, పి.సరోజిని పాల్గొన్నారు.


సమర్థంగా ఓటరు సర్వే

బాపట్ల: ఇంటింటి ఓటరు జాబితా సవరణలపై చేపట్టిన సర్వే సమర్థంగా నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టరు పి.రంజిత్ బాషా తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో ఓటర్ల సంక్షిప్త సవరణ జాబితాపై రాజకీయ పార్టీల నాయకులతో బుధవారం సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా జిల్లాలో 5.12 లక్షల ఓటర్లను సర్వే చేస్తామని తెలిపారు. ఐదు రోజుల్లో 35 వేల 278 ఇళ్లు సర్వే చేశామని చెప్పారు. 81,076 ఓట్లు సర్వే చేసినట్లు వివరించారు. జాబితాలో ఓటు సవరణ కోసం 2,357 దరఖాస్తులు వచ్చాయన్నారు. చేర్పుల కోసం 727 దరఖాస్తులు రాగా జాబితా నుంచి 384 తొలగించేవిగా గుర్తించినట్లు చెప్పారు. సర్వే ప్రక్రియ జిల్లాలో పారదర్శకంగా నిర్వహిస్తున్నామని వివరించారు. ఓటరు సవరణ జాబితా ప్రక్రియలో ఆన్‌లైన్ దరఖాస్తుల నమోదు, పరిశీలనపై ఎదురైన సాంకేతిక సమస్యలను తక్షణమే పరిష్కరిస్తామని పేర్కొన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు ఏజెంట్లను నియమించుకోవాలని చెప్పారు. ఓటరు సవరణ ప్రక్రియలో రాజకీయ పార్టీల సహకారం తప్పనిసరి అని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో డీఆర్‌ఓ కె.లక్ష్మీశివజ్యోతి, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు కృష్ణకాంత్, వైఎస్సార్ సీపీ, టీడీపీ, బీజేపీ, కాంగ్రెస్ నాయకులు ఇనగలూరి మాల్యాద్రి, జి.శ్రీనివాసరావు, రామకృష్ణ, పి.మహబూబ్ ఖాన్(రాజేష్) పాల్గొన్నారు.

తప్పిన పెను ప్రమాదం

అదుపు తప్పిన ప్రైవేటు స్కూల్ బస్సు

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండలం మంచికలపూడి దుగ్గిరాల మధ్య బుధవారం సాయంత్రం ఓ ప్రైవేటు స్కూల్ బస్సు అదుపు తప్పిపొదల్లోకి దూసుకెళ్లింది. అయితే ఎవరికీ ఏమీ కాకపోవడంతో స్కూలు యాజమాన్యం, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. దుగ్గిరాలలోని మాంటిస్సోరి స్కూల్ బస్సు సాయంత్రం 40 మంది పిల్లలతో మంచికలపూడికి బయలుదేరింది. మంచికలపూడి సమీపంలోని ఈద్గా సమీపంలో ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించేందుకు స్కూల్ బస్సు డ్రైవర్ మార్జిన్‌లోకి దింపడంతో అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న ముళ్ల పొదల్లోకి దూసుకుపోయింది. ఆ సమయంలో 40 మంది విద్యార్థులు ఉన్నట్లు సమాచారం. పిల్లలు ఏడుస్తూ కేకలు పెట్టడంతో రోడ్డు వెంబడి ప్రయాణించే వాహనదారులు బస్సులో నుంచి విద్యార్థులకు బయటకు తీశారు. విద్యార్థులు సురక్షితంగా ఉండడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదంపై పోలీసులు డ్రైవర్‌ను ఆరా తీశారు.



పొదల్లోకి దూసుకెళ్లిన స్కూల్ బస్సు

మీడియా మంచినే ప్రోత్సహించాలి

- జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి
- జర్నలిస్టుల గుర్తింపు కార్డుల పంపిణీ

నరసరావుపేట: మంచిని పెంచి ప్రోత్సహించడమే మీడియా లక్ష్యం కావాలని కలెక్టర్ ఎల్.శివశంకర్ పేర్కొన్నారు. కలెక్టర్ చాంబర్‌లో బుధవారం సమాచార, పౌర సంబంధాల శాఖ ద్వారా జిల్లాలోని మీడియా ప్రతినిధులకు జారీ చేసిన అక్రిడిటేషన్ గుర్తింపు కార్డుల మంజూరు ప్రక్రియను కలెక్టర్ ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ సమాజ ప్రగతిలో అమోఘమైన పాత్రను పోషిస్తుందని అభినందనలు తెలిపారు. ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావడం ద్వారా పరిష్కారానికి కృషి చేస్తున్న మీడియా విధులతో పాటు, బాధ్యతగా పనిచేయాలని సూచించారు. ప్రజలకు, ప్రభుత్వ అధికారులకు మధ్య వారధిగా మీడియా ప్రతినిధులు పనిచేయాలని, తద్వారా మెరుగైన సమాజం ఏర్పడుతుందన్నారు. సమాచార పౌర సంబంధాల శాఖ అధికారిణి దీప్తి మాట్లాడుతూ నేటి నుంచి జిల్లాలో మీడియా ప్రతినిధులకు ప్రభుత్వ గుర్తింపు అక్రిడేషన్ కార్డులను జారీ చేయడం జరుగుతుందన్నారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు నరసరావుపేట ఆర్టీసీ బస్టాండ్ వెనుక, ప్రకాష్‌నగర్ ఒకటో లైన్, సమాచార పౌర సంబంధాల శాఖ జిల్లా కార్యాలయంలో అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మీడియా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

4 లోగా రీకౌంటింగ్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు

పెడన: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం గుంటూరు వారు నిర్వహించిన పదో తరగతి, ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు ఈ నెల 25న విడుదలైనట్లు జిల్లా విద్యాశాఖాధికారి తాహెరా సుల్తానా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫలితాలు డబ్ల్యూ. డబ్ల్యూ. డబ్ల్యూ. ఏపీ ఓపెన్ స్కూలు. ఏపీ. జీవోవీ. ఇన్‌లో చూసుకోవాలని ఆమె పేర్కొన్నారు. కృష్ణాజిల్లాకు సంబంధించి పదో తరగతిలో 515 మంది పరీక్ష రాయగా 351 మంది ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. ఇంటర్మీడియెట్‌లో 986 మందికి 774 మంది పాస్ అయ్యారని పేర్కొన్నారు. ఫలితాల్లో ఏమైనా సందేహాలుంటే పది, ఇంటర్ వారు రీ వెరిఫికేషన్ కోసం ఒక్కో సబ్జెక్టుకు రూ.200 చెల్లించాల్సి ఉంటుందన్నారు. రీ కౌంటింగ్‌కు ఒక్కో సబ్జెక్టుకు రూ.1000 చెల్లించి ఈ నెల 27 నుంచి ఆగస్టు నాలుగో తేదీ వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందన్నారు. 2023–24 విద్యా సంవత్సరంలో పది, ఇంటర్ ప్రవేశాల కోసం ఈ నెల 27 నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు అవకాశం కల్పించారని పేర్కొన్నారు. ఇతర వివరాలకు ఓపెన్ స్కూల్స్ హెల్ప్ లైన్ నంబరు 80084 03506లో సంప్రదించాల్సిందిగా డీఈవో సూచించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ సెయింట్‌పీటర్స్ MPHW(F) ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ కోర్సులు: ANM (నర్సింగ్ కోర్స్) 2సం॥, అర్హత: ఇంటర్ పాస్, వ॥17-30సం॥, SC,ST,BCలకు 35 సం॥ ఉచిత విద్య, హాస్టల్ వసతి. 9652998050

■ జీనియస్ కాలేజ్ ఆఫ్ పారామెడికల్ సైన్సెస్ కోర్సులు:D.M.P.H.A,D.M.L.T,D.A.N.S, D.R.G.A. అర్హత: ఇంటర్ పాస్, కాలపరిమితి -2 సం॥ (E.M) సంప్ర: ప్యాడిసన్‌పేట, తెనాలి. 9491664920

■ ఇంటర్ ఫెయిలా? విచారించకండి. వస్తు B.Sc, B.Com, BAలలో చేరుటకై సంప్ర: శ్రీసత్య సూర్య కాలేజి 4/18 బ్రాడీపేట, గుంటూరు. Ph: 9346446079

DISTANCE EDUCATION

■ ఓపెన్ 10th, ఇంటర్ మరియు BA, B.Com, B.Sc, M.A, M.Com, M.Sc, MBA, MCA, ITI లకు పాస్ గ్యారంటీ శిక్షణ ఇవ్వబడును. సంప్ర॥ శ్రీ దివ్య ఇన్‌స్టిట్యూషన్స్, 2/3, అరండల్‌పేట, గుంటూరు. 7396755801

■ ఇంటర్ ఫెయిలయ్యారా ! చింతించవద్దు - Join Inter One Sitting. Govt. Recognised Board. Exams : October - 2023. (C) Vijayawada : 89774 25849, 91333 40140

REAL ESTATE

PLOT FOR SALE

■ అమరావతిరోడ్డు గోరంట్ల, గుంటూరులో ఇన్వెస్ట్‌మెంట్ కోసం అనుకూలంగా అపార్ట్‌మెంట్/విల్లాస్‌కు దగ్గరలో 1400చ॥గజు తూర్పు ఫేస్, మొత్తంగా/ విడివిడిగా కలదు. రేట్ 16,000 గోరంట్ల విల్లాస్‌కు ప్రక్కన దక్షిణం ఫేస్ 30అడుగుల రోడ్డు 177చ॥గ॥ ప్లాట్ కలదు. రేటు 13,000 క్లియర్ టైటిల్, స్పాట్ రిజిస్ట్రేషన్. 9502168948

TOLET COMMERCIAL

■ గుంటూరు అరండల్‌పేట 9వలైను 2వ అడ్డరోడ్డు D.No:6-9-28, గ్రౌండ్‌ఫ్లోర్, 2వఫ్లోర్, 3వఫ్లోర్ 1200 Sft సౌత్ ఫేసింగ్ కమర్షియల్‌కు అద్దెకు ఇవ్వబడును 9700118383

SERVICES

■ కపిల ఆవు అమ్మబడును. పూర్తి నల్ల రంగు (8నెలల సూడి) మరియు తెల్ల ఆవు అమ్మకంనకు కలదు. పూర్తి వివరాలకు సంప్ర॥ 9985091890

ASTROLOGY

■ విద్య, ఇంటి, వ్యాపార, ప్రేమ వివాహం, ఆరోగ్య సమస్య ఒక్క కాల్‌తో అన్ని సమస్యలకు పరిష్కారము బాబా MS ఖాన్. Hyd. Ph: 9652149253

BUSINESS OFFER

■ ద్వారకా ఎంటర్‌ప్రైజెస్ పేపర్ ప్లేట్స్ & LED మెషీన్స్‌పై ప్రతి నెల అధిక ఆదాయం, అద్భుత అవకాశం, ఉచిత ముడి పదార్థాలు, 100% తిరిగి కొనుగోలు ఒప్పందం. ఫోన్ : 9310515624, 8800496710

BABY CARE CENTER

■ 30సం॥ నుండి నడపబడుతున్న సంతోష్ బేబీకేర్ సెంటర్ నందు 4నెలల నుండి 4సం॥ వరకు మీ పాప/బాబులను జాగ్రత్తగా చూడబడును. 2వలైను, అంకమ్మనగర్, గుంటూరు. 8686209090

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 91699 22299

■ బంగారం బ్యాంకులలో ఇతర సంస్థలలో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధరకు కొనబడును. (స్పాట్ క్యాష్) ✆ 9912105656

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) 100% జెన్యూన్. ✆ 76508 91999

■ బంగారం బ్యాంకులలో, ఇతర సంస్థలలో ఉన్నవి ఈరోజు ఆన్‌లైన్ ధరకు కొనబడును. స్పాట్‌క్యాష్ (100% జెన్యూన్) సంప్ర : ✆ 945 945 3338

TOURS & TRAVELS

■ కార్తీకపౌర్ణమి సందర్భంగా కాశీయాత్ర 22-11-2023, ద॥పూరి, కోణార్క్, భువనేశ్వర్, సాక్షి గోపాల్,అలహాబాద్,సీతామఢి, 9రోజులు టి॥ ఒక్కింటికి 10500. STట్రావెల్స్. 9885853240

WANTED

■ నోబుల్ ఓపెన్ కాలేజి 10th క్లాసు మరియు ఇంటర్ ఫెయిల్ అయిన విద్యార్థులకు గొప్ప సదవకాశం.M.L.T, M.P.H.W. ఫిజియోథెరపి, డైరీ టెక్నాలజీ అడ్మిషన్స్ కొరకు సంప్ర: 9542673473, 9000667762

■ డ్రైవర్లు కావలెను: హెవీ లైసెన్స్ కలిగి ఉండవలెను. జీతం: 16,000/- నెలకు, పని చేయు ప్రదేశం: మాస్టర్‌మైండ్స్, గుంటూరు. ఫోన్: 92487 22282

■ 10th, ఇంటర్, డిగ్రీ, B.Tech చదివి ఖాళీగా ఉంటున్న వారికి ఆఫీసులు, షోరూమ్‌లు, షాపింగ్ మాల్స్ Ltd కంపెనీల్లో మా సంస్థ ద్వారా ప్లేస్‌మెంట్స్ కలవు. ఓన్లీ ఆఫీసు వర్క్. సంప్ర: 9963255441

■ Wanted Female English and Hindi Literature Teachers to Teach in a Reputated School. Contact: 9948446523

■ గుంటూరులోని ప్రముఖ కన్‌స్ట్రక్షన్ కంపెనీలో అపార్ట్‌మెంట్ ప్లాట్లు, ఇండిపెండెంట్ హౌసెస్, ఓపెన్ ప్లాట్లు బుక్ చేయుటకు యువతీ/యువకులు కావలెను. జీతం: రూ.25,000/– 98487 40060

■ S.M.R మార్కెటింగ్ నందు మార్కెటింగ్ చేయుటకు యువతీ/ యువకులు వెంటనే కావలెను. సంప్ర: ఫోన్: 9440271577

■ సిటీ జంబో జిరాక్స్ 9/1 అరండల్‌పేట గుంటూరులో పనిచేయుటకు 10th,ఇంటర్, చదివిన M/F & కంప్యూటర్ ఆపరేటర్ కావలెను. గుంటూరు లోకల్ వారు మాత్రమే. 9441065559

■ తెనాలిలోని వైష్ణవి కాలేజీ హాస్టల్‌లో పని చేయుటకు మగ హాస్టల్ ఇంచార్జ్ కావలెను. హాస్టల్‌లో ఉండవలెను. ఆసక్తిగల వారు సంప్రదించండి. వైష్ణవి కాలేజి, స్టేషన్ రోడ్. 9290769284

■ కొత్తగా స్థాపించిన మా కంపెనీ నందు పని చేయడానికి అభ్యర్థులు కావలెను. అర్హత: Qul: 10th to P.G. P/T-8000/-, F/T-12,500/- 8500509114

■ ప్రముఖ సంస్థకు మాయొక్క మొబైల్ ద్వారా సమాచారం పంపుతూ వారం వారం అధిక ఆదాయం సంపాదించుకోండి. మీ అడ్రస్ వాట్సప్ చేయండి. 88854 86421.

■ Wanted Field Collection Executives in Narasaraopet, Sattenapalli & Perecharla. Experience Preferred. Salary + Incentives. Contact : 88856 81417, 99499 72701.

సాక్షి క్లాసిఫైడ్స్ గుంటూరు ఎడిషన్ రూ.475/- మాత్రమే
ప్రతి అదనపు లైను రూ.100/- మాత్రమే
గుంటూరు 97030 13015 97034 67843 92904 02000

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

త్యాగానికి ప్రతీక మొహర్రం

- గ్రామాల్లో ముస్తాబైన పీర్లచావిళ్లు.. కొనసాగుతున్న వేడుకలు
- ఉమ్మడి గుంటూరులోనే కొండవీడులో వైభవంగా నిర్వహణ
- 2న పెద్దషరగత్.. నిప్పులగుండంపై నడక


నిప్పుల గుండం రాజేసిన దృశ్యం

యడ్లపాడు: మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే మొహరం సంతాప దినాలు హిజ్రీ క్యాలెండర్ ప్రకారం ఈనెల 19వ తేదీ నుంచి ప్రారంభమయ్యాయి. ఇస్లాం ధర్మాన్ని రక్షించేందుకు మొహమ్మద్ ప్రవక్త (సఅసం) మనుమలు ఇమామ్ హసేన్, ఇమామ్ హుస్సేన్ తదితర వీరుల సంస్మరణార్థం మొహర్రం పండుగ నిర్వహిస్తారు. 14 శతాబ్దాల క్రితం ఇరాక్‌లోని కర్బలా ప్రాంతంలో శాంతిస్థాపన కోసం చేసిన యుద్ధంలో వారు తమ ప్రాణాలు త్యాగం చేశారు. దీంతో అప్పటి నుంచి ముస్లింలు మొహర్రం మాసాన్ని సంతాప దినాలుగా పాటిస్తారు. ప్రాణత్యాగం చేసిన వారి పేరిట ముస్లింలోని సున్నీజమాతులు దానధర్మాలు చేయడం, ఉపవాసాలు పాటించడం వంటి ధార్మిక కార్యక్రమాలు చేపడతారు. మొహర్రం అనే పేరు హారం అనే పదం నుంచి వచ్చిందని, హారం అనగా ఉర్దూలో త్యాగం, క్షమాపణ అని అర్థం.

నాడు పవిత్ర యుద్ధంలో అమరులైన వారికి ముస్లింలోని షీయా తెగకు చెందినవారైతే గుండెలపై బాదుకుంటూ రక్తం చిందిస్తూ మాతం యాత్రను నిర్వహిస్తూ ఎంతో ఆవేదనగా తమ సంతాపాన్ని తెలుపుతారు. ఈ పండుగను జిల్లావ్యాప్తంగా నిర్వహించినప్పటికీ ఉమ్మడి గుంటూరు జిల్లాలోనే అత్యంత వైభవంగా యడ్లపాడు మండలం కొండవీడులో నిర్వహిస్తారు. కోట, బోయపాలెం, కారుచోల, యడ్లపాడు, తిమ్మాపురం గ్రామాల్లో సర్వమతాలకు చెందిన వారు ఇక్కడ పీర్లచావిడిలో జరిగే పెదషరిగత్ కార్యక్రమానికి పెద్ద ఎత్తున ప్రజలు హాజరుకావడం, తమ మొక్కుల్ని తీర్చుకోవడం విశేషం. మతసామరస్యానికి ప్రతీకగా ఈ పండుగ నిలుస్తుంది. మొహర్రం నెలతోనే ఇస్లాం యొక్క నూతన సంవత్సరం ప్రారంభం కావడం విశేషం.

పండుగా ఇలా..

ఈ మాసపు నెలవంక చూశాకా ప్రత్యేక ప్రదేశాల్లో భద్రపరిచిన పీర్లను శుభ్రం చేసి పంజాలను (అమరుల ముద్రికలు)లను అషుర్‌ఖానా (చావిళ్ల)లో ప్రతిష్ఠిస్తారు. వీటిని తెలుగులో పీర్లు అంటారు. అదే రోజున పీర్ల చావిడిల వద్ద ఆలా(అగ్నిగుండం) కోసం గుంతను తవ్వుతారు. టన్నుల కొద్దీ కలపను తెచ్చి గుండాన్ని రాజేస్తారు. కార్యక్రమ నిర్వాహకులు (ముజావర్లు) ఆరాధన ప్రక్రియను నిర్వహిస్తారు. మొదటి ఐదు రోజులు పీర్లను చావిళ్లలోనే ఉంచి దువా (ప్రార్థన)లు చేస్తారు. 7వ రోజున చిన షెరగత్ (గ్రామోత్సవం), పదో రోజున పెద్ద ఎత్తున భక్తులు పాలతో తయారు చేసిన పానకం (రంగ్‌షర్బత్)ను మట్టిపాత్రల్లో తెచ్చి అగ్నిగుండం చుట్టూ తిరిగి పీర్ల చావిడిలో సమర్పిస్తారు. ఇదే రోజున వైభవంగా చిరాఖీ (దీపారాధన) చేస్తారు. ఈనెల 28న పెద్ద షెరగత్ గ్రామంలోనే కాకుండా సమీప గ్రామాల్లో అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. ఆరోజున భారీ విద్యుద్దీపాలతో వేలాది జనంతో కొండవీడు కళకళలాడుతుంది. అర్ధరాత్రి నిప్పుల గుండం చుట్టూ తిరుగాడుతూ హుస్సేన్.. హుస్సేన్..దూలా అంటూ లయబద్ధంగా యుద్ధ విన్యాసాలు చేస్తారు. అర్ధరాత్రి 1.30 గంటలకు పూలపాన్పులా మాదిరి పరిచిన నిప్పులపై ఉపవాసాలతో పంజాలను పట్టుకుని తిరుగాడతారు. ఆ నిప్పుల్లో తమ పాపాలు భస్మమై, భక్తితో కోరిన కోర్కెలు నెరవేరుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. మరుసటి రోజు (29వ తేదీన) పంజాలకు షహదత్ (నిమజ్జనం) కార్యక్రమం నిర్వహిస్తారు. అనంతరం నిప్పుల గుండాన్ని పూడ్చి దానిమ్మ, లేదా పండ్లమొక్కలను నాటడం పూర్వీకుల నుంచి వస్తున్న ఆచారం.

ఐక్యతకు ప్రతీక పండుగ...

మొహర్రంను హిందూ, ముస్లింలు కలిసి ఘనంగా జరుపుకుంటారు. ముస్లింలతో పాటు ఎంతో భక్తిశ్రద్ధలతో హిందువులు పండుగను చేయడం విశేషం. హిందువులు తమ గ్రామంలోని చావిడికి వెళ్లి పీర్లను దర్శించి ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. మొక్కులు చేసుకున్న పీర్లను తమ ఇళ్లకు తీసుకుని వెళ్లి ప్రత్యేకంగా అలంకరించి పీర్ల చావిడి వద్దకు ఊరేగింపుగా తీసుకువస్తారు. పండుగ తొమ్మిది రోజుల పాటు పీర్ల వద్ద జరిగే ప్రార్థనలు జరిగే అన్ని రోజులు ఐక్యంగా పాల్గొంటారు.

ఆస్పత్రి అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలి

మంత్రులు అంబటి, మేరుగ

గుంటూరు మెడికల్: రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున, రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబులను గుంటూరులోని వారి కార్యాలయాల్లో బుధవారం గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని ఆసుపత్రుల అభివృద్ధి కోసం విశేష కృషి చేస్తున్నారని తెలిపారు. కొత్తగా మెడికల్ కళాశాలను ఏర్పాటు చేసి కనీస సదుపాయాలను కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. పాత టీచింగ్ ఆసుపత్రులను నాడు – నేడు కార్యక్రమంలో భాగంగా బలోపేతం చేస్తున్నారని చెప్పారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని నేతృత్వంలో వైద్య రంగాన్ని బలోపేతం చేస్తున్నారన్నారు. ఆసుపత్రి అభివృద్ధి కార్యక్రమాలు, సమస్యల గురించి తమ దృష్టికి తీసుకుని వస్తే క్యాబినెట్‌లో చర్చించి సమస్యలను పరిష్కరించేవిధంగా కృషి చేస్తామన్నారు. ఆరోగ్య శ్రీ, ఆసరా పథకాలు ప్రతి ఒక్క పేద రోగికి అందించే విధంగా కృషి చేయాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కలలను సాకారం చేసేందుకు కృషి చేస్తున్నామని, మీ వంతు ప్రయత్నం చేయాలని సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్‌కు మంత్రులు సూచించారు. గుంటూరు జీజీహెచ్‌ను రిఫరల్ ఆసుపత్రిగా తీర్చిదిద్దడానికి మెడికల్ హెల్త్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కృష్ణ బాబు, డీఎంఈ డాక్టర్ నరసింహంతో సమన్వయం చేసుకుని ఆసుపత్రి అభివృద్ధి కోసం ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు.

సమాజాన్ని కదిలించేది కవిత్వమే..

కొరిటెపాడు(గుంటూరు): సమాజానికి వికాసాన్ని, వినోదాన్ని, పరిజ్ఞానాన్ని అందిస్తూ సమాజంలో ఎదగడానికి కవిత్వమే తోడ్పడుతుందని గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దేవానంద్ పేర్కొన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఎం.సుధాకర్‌రెడ్డి రచించిన 'మధు ఘంటికలు' పుస్తకాన్ని బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దేవానంద్ మాట్లాడుతూ విద్యార్థులు, నిరుద్యోగ యువతకు ఈ కవితా సంపుటి మార్గదర్శిగా, దిక్సూచిగా నిలుస్తుందన్నారు. రచయిత సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి పౌరుడు పుస్తకాలు చదివి విజ్ఞాన, వికాసాలు, పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కవితా సంపుటి సమాజానికి, అన్ని తరగతులకు ప్రయోజనకారిగా నిలుస్తుందనే ఆశాభావం వ్యకం చేశారు. గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కందుల ఝాన్సీలక్ష్మి మాట్లాడుతూ గ్రంథాలయ అధికారిగా పదవీ విరమణ అనంతరం సుధాకర్‌రెడ్డి చక్కని కవితలతో పుస్తకాన్ని ఆవిష్కరించడం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో పాఠకుడు ఓ.జగన్‌రెడ్డి, సీనియర్ సహాయకులు సీతారామయ్య, కంపా శ్రీనివాస్, రాజేష్, శ్రీనివాసులు, బ్రహ్మయ్య, సంజయ్, నాగిరెడ్డి, చిన్నపరెడ్డి పాల్గొన్నారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దేవానంద్, సుధాకర్‌రెడ్డి, ఝాన్సీలక్ష్మి తదితరులు

గోమాత.. మాభాగ్యవిధాత..


గోమాతకు సీమంతం నిర్వహిస్తున్న స్థానికులు

నాదెండ్ల: గణపవరం గ్రామ పరిధిలోని చవిటి పాలెంలో బుధవారం గోమాతకు మహిళలు వైభవంగా సీమంతం నిర్వహించారు. కాలనీకి చెందిన వెంకటరెడ్డి, పోలేరమ్మ ఇంటి వద్ద గోవును సాకుతున్నారు. గతేడాది మొదటి ఈత అవగా, రెండోసారి గర్భం రావటంతో బుధవారం స్థానిక మహిళలు గోమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పసుపు కుంకుమ రాసి పూలమాలలతో అలంకరించారు. చీరె సారె అందించి పూజలు చేశారు. ముత్తయిదువులకు వాయినాలు అందించారు. గోమాతను తాము చిన్న దూడగా ఉన్నప్పటి నుంచి సాకుతున్నామని, తమ కుటుంబ సభ్యురాలిగా భావిస్తున్నామని పేర్కొన్నారు.

మహిళా కానిస్టేబుల్‌కు సీమంతం


మహిళా కానిస్టేబుల్ సీమంతంలో డీఎస్పీ, టూటౌన్ సీఐ

చీరాల అర్బన్: పోలీస్ సిబ్బంది ఒక కుటుంబం అని డీఎస్పీ ప్రసాదరావు అన్నారు. చీరాల టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో మహిళా కానిస్టేబుల్ కల్యాణికి మంగళవారం రాత్రి సీమంతం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డీఎస్పీ ప్రసాదరావు ఆశీర్వదించి మాట్లాడుతూ పోలీస్ విభాగంలో పనిచేస్తున్న ప్రతి ఒక్కరూ సహ ఉద్యోగులతో ఐకమత్యంతో ముందుకు సాగితే విజయం సాధ్యమవుతుందని చెప్పారు. కార్యక్రమంలో టూటౌన్ సీఐ సోమశేఖర్, ఎస్‌ఐ చంద్రావతి పాల్గొన్నారు.

ఎయిమ్స్ రోడ్డులో విరిగిపడిన కొండ చరియలు


ఎయిమ్స్ రోడ్డులో విరిగి పడిన కొండ చరియలు

మంగళగిరి: నగరంలోని ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) ప్రధాన రహదారిలో కొండ చరియలు విరిగి పడ్డాయి. బుధవారం జోరుగా వర్షం కురవడంతో వడ్డేశ్వరం జాతీయ రహదారి నుంచి ఎయిమ్స్‌కు వెళ్లే రోడ్డులో పలు చోట్ల కొండ చరియలు విరిగి పడుతుండటంతో అటుగా వెళ్లేవారు ఆందోళనకు గురి అయ్యారు.

క్షణికావేశానికి యువకుడు బలి

కర్రతో దాడి చేయడంతో..


చనిపోయిన కోటేశ్వరరావు

బల్లికురవ: కర్రతో దాడి చేయడంతో యువకుడు మృతి చెందిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. మార్టూరు మండలం రాజుపాలేనికి చెందిన పోట్లూరి కోటేశ్వరరావు(24), సమీప బంధువు పోట్లూరి రామలింగం, కొమ్మినేనివారిపాలెంలో ఉంటున్నారు. బేల్దారి పనులు చేస్తుంటారు. తెలంగాణలోని కరీంనగర్ జిల్లాకు బేల్దారి పనులకు వెళ్లేందుకు మేస్త్రీ వద్ద చెరో రెండు వేల రూపాయలు తీసుకున్నారు. కానీ కోటేశ్వరరావు పనికి రాను అనటంతో ఇద్దరి మధ్య మాటామాటా పెరిగి ఘర్షణకు దారితీసింది. రామలింగం, కోటేశ్వరరావుపై కర్రతో దాడి చేశాడు. తలకు బలమైన గాయం కావటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనా స్థలాన్ని సంతమాగులూరు సీఐ ప్రభాకర్, బల్లికురవ ఎస్‌ఐ వి.వేమన పరిశీలించారు. మృతుడికి భార్య ఏసమ్మ, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఘటనతో కొమ్మినేనివారిపాలెం రాజుపాలెం గ్రామాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి.

మా సర్టిఫికెట్లు నకిలీవి కావు

సెయింట్ జాన్ అంబులెన్స్ స్పష్టీకరణ

అమరావతి: సెయింట్ జాన్ అంబులెన్స్ ఏపీ శాఖ ఇస్తున్న పవర్ మెడిసిన్ సర్టిఫికెట్లు నకిలీవి అంటూ జరుగుతున్న ప్రచారాన్ని ఆ సంస్థ కార్యదర్శి డాక్టర్ విద్యుత్‌కుమార్ ఖండించారు. అవి నకిలీ సర్టిఫికెట్లు కావని, ఏపీ ప్రభుత్వంతో కుదిరిన ఒప్పందం మేరకు గత 30 ఏళ్లుగా వాటిని జారీ చేస్తున్నామని వెల్లడించారు. అలాగే తాము రూ.15 కోట్ల వాణిజ్య పన్ను కట్టాల్సి ఉందంటూ వస్తున్న ఆరోపణలు కూడా అవాస్తవమన్నారు. ఈ విషయంలో కొందరు వ్యక్తులు ఉద్దేశపూర్వకంగా తమపై దుష్ప్రచారం చేస్తున్నారని, అలాంటివారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

పట్నంబజారు: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందిన ఘటనపై కేసు నమోదైంది. ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాలప్రకారం అమరావతి రోడ్డుకు చెందిన షేక్ షమీన్ (26) ప్రైవేటు జాబ్ చేస్తుంటాడు. పనులు ముగించుకుని బుధవారం రాత్రి ఇంటికి వెళుతున్న సమయంలో ట్రాక్టర్ ఢీకొనడంతో ఘటనా స్థలంలోనే మృతిచెందాడు. బాధితుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సేవాభారతి, తెలుగుతేజం పురస్కారాల ఎంపికకు దరఖాస్తులు ఆహ్వానం

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని ప్రతిభ ఉండి పలు రంగాల్లో గుర్తింపు రాని వారిని గుర్తించి హైదరాబాద్‌లో ఆగస్టు 13న ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ సేవాసంస్థ ఆధ్వర్యాన సేవాభారతి, తెలుగుతేజం పురస్కారాలతో సత్కరించనున్నట్లు అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ ఇఎస్ఎస్ నారాయణ మాస్టారు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన వారు వచ్చే నెల 5వ తేదీలోపు వారు అందించిన సేవలను తెలియజేసే సర్టిఫికెట్లతో ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీకి దరఖాస్తులు పంపించాల్సిందిగా కోరారు. మరింత సమాచారం కోసం 96523 47207 నంబర్‌లో సంప్రదించాల్సిందిగా ఆయన తెలిపారు.

హ్యాండ్‌బాల్ రాష్ట్ర సంఘానికి గుర్తింపు


సత్యనారాయణరాజు

విజయవాడస్పోర్ట్స్: పెనుమత్స సత్యనారాయణరాజు కార్యదర్శిగా కొనసాగుతున్న ఆంధ్రప్రదేశ్ హ్యాండ్‌బాల్ అసోసియేషన్‌ను గుర్తిస్తూ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(హెచ్ఏఐ) బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. గత కొన్నేళ్లుగా రాష్ట్ర హ్యాండ్‌బాల్ అసోసియేషన్‌కు పోటీ సంఘాలు పుట్టుకొచ్చి క్రీడాకారులను అయోమయానికి గురి చేశాయి. వీటన్నింటికీ చెక్ పెడుతూ రాష్ట్రంలో ఒకే సంఘానికి హెచ్ఏఐ గుర్తింపు ఇచ్చింది. హెచ్ఏఐ గుర్తింపు ఆదేశాలతో రాష్ట్ర ఒలింపిక్ సంఘం ఇదే సంఘాన్ని గుర్తించింది. ఈ సంఘానికి అధ్యక్షుడిగా ఎస్.కృష్ణకుమార్, కోశాధికారిగా పి.శివారెడ్డి ఉన్నారు. పలువురు అభినందనలు తెలిపారు.

ద్విచక్రవాహనాల దొంగలు అరెస్ట్

8 వాహనాలు స్వాధీనం


నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న ద్విచక్రవాహనాలతో సీఐ శ్రీనివాసరావు

గుంటూరు రూరల్: చెడు వ్యసనాలకు బానిసలై ద్విచక్రవాహనాలను చోరీచేసి జల్సాలు చేసే నిందితులను నల్లపాడు పోలీస్ స్టేషన్ పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. అడవితక్కెళ్లపాడులోని నల్లపాడు పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ శ్రీనివాసరావు నిందితుల వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 22వ తేదీన వెల్లంపల్లి శివరామకృష్ణ తన ద్విచక్రవాహనం చోరీకి గురైందని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. జిల్లా ఎస్పీ ఆరీఫ్ హాఫీజ్ ఆదేశాలమేరకు సౌత్ డివిజన్ డీఎస్పీ ఎండీ మహబూబ్‌బాషా పర్యవేక్షణలో నిందితులకోసం దర్యాప్తు చేపట్టం జరిగిందన్నారు. నగరంలోని శివనాగరాజుకాలనీ 11వ లైనుకు చెందిన యర్రసాని రాజు ఉరఫ్ ఇమ్మానియేలు అనే వ్యక్తి మంగళదాస్‌నగర్ 1వ లైనుకు చెందిన పాతకోటి దేవదానం అనే ఇరువురు స్నేహితులు మద్యం, మత్తు పదార్థాలకు బానిసలై సులువుగా డబ్బు సంపాదించేందుకు ద్విచక్రవాహనాల చోరీని ఎంచుకున్నారన్నారు. ఈ క్రమంలో గుంటూరు రూరల్, మంగళదాస్‌నగర్ తదితర ప్రాంతాల్లో రాత్రిళ్లు ఇళ్ల ముందు నిలిపిన వాహనాలను చోరీచేస్తున్నారని తెలిపారు. ఇరువురిని ఇన్నర్ రింగ్‌రోడ్డులో అదుపులోకి తీసుకుని విచారణ చేయగా, నిందితులు చేసిన నేరాలను ఒప్పుకున్నారని తెలిపారు. నిందితుల వద్దనుంచి సుమారు రూ.4 లక్షలు విలువ చేసే 8 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించటం జరిగిందని తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో కృషిచేసిన సిబ్బందిని జిల్లా ఎస్పీ, డీఎస్పీ అభినందించారని తెలిపారు.

ఓపెన్‌స్కూలు ఫలితాల్లో బాలికలు ముందంజ

జిల్లా విద్యాశాఖాధికారి శామ్యూల్

నరసరావుపేట: ఏపీ సార్వత్రిక విద్యాపీఠం ఏపీ ఓపెన్ స్కూలు ఆధ్వర్యంలో జూన్, జూలై మాసాల్లో నిర్వహించిన పదోతరగతి, ఇంటర్ పరీక్షలకు సప్లిమెంటరీ పరీక్షల్లో బాలికలు మెరుగైన ఉత్తీర్ణత సాధించారని జిల్లా విద్యాశాఖాధికారి కె.శామ్యూల్ బుధవారం పేర్కొన్నారు. జిల్లాలో పదోతరగతి పరీక్షలకు 926 మంది హాజరుకాగా వారిలో బాలికలు 463 మందికి గాను 292 మంది, బాలురు 463 మందికి గాను 204 మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. ఇంటర్ పరీక్షలకు 2072 మంది హాజరైతే బాలికలు 747 మందికి గాను 444 మంది ఉత్తీర్ణత సాధించగా, బాలురు 1325 మంది హాజరై 619 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. జిల్లాలో పదోతరగతి ఉత్తీర్ణత శాతం 53.56 శాతం కాగా, ఇంటర్మీడియేట్ ఉత్తీర్ణత శాతం 51.30 శాతంతో రాష్ట్రంలో పదో తరగతిలో 18వ స్థానం, ఇంటర్మీడియేట్‌లో 20వ స్థానంలో నిల్చిందన్నారు. ఈనెల 27వ తేదీ నుంచి ఆగస్టు నాల్గవ తేదీ వరకు ఏపీటీ ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించి రీకౌంటింగ్, రీ వెరిఫికేషన్ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జూన్ 26 నుంచి జూలై నాలుగు వరకు నిర్వహించిన పరీక్షల ఫలితాలకు మార్కుల మెమోలను www.apope nrchoo.ap.gov.inలో పొందుపర్చారన్నారు. 2023–24 విద్యాసంవత్సరానికి జూలై 26 నుంచి ఆగస్టు 31వరకు అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతుందన్నారు. దీనికి సంబంధించి ఈ విద్యాసంవత్సరం నుంచి అభ్యర్థులకు పాఠ్య పుస్తకాలు, మార్కుల మెమోలు, పాస్ సర్టిఫికేట్లు నేరుగా వారి చిరునామాలకు పంపుతామని తెలిపారు. ఏపీ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో ఏపీ ఓఎస్ఎస్..జ్ఞానధార ప్రత్యేక యూట్యూబ్ ఛానల్‌ను ప్రారంభించారన్నారు. దీనిలో 10వ తరగతి, ఇంటర్ విద్యార్థులకు ఉపయోగకరమైన పాఠ్యాంశాల వీడియోలను పొందుపర్చారన్నారు. అభ్యాసకులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని డీఇవో శామ్యూల్, జిల్లా కో ఆర్డినేటర్ హుస్సేన్ తెలియచేశారు.

కుష్ఠు వ్యాధి నిర్మూలన చాలా సులభం

జిల్లాలో 34 కేసులు నిర్ధారణ


డీపీఎంవోలతో సమీక్షిస్తున్న జిల్లా అధికారి డాక్టర్ పద్మావతి

నరసరావుపేట: కుష్ఠు వ్యాధి మచ్చ రూపంలో ఉన్నప్పుడే నిర్ధారించి నిర్మూలన చర్యలు తీసుకుంటే వ్యాధి పూర్తిగా నయమౌతుందని జిల్లా లెప్రసీ, క్షయ నిర్మూలన అధికారి డాక్టర్ పి.పద్మావతి పేర్కొన్నారు. కుష్ఠువ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా బుధవారం పట్టణంలోని తన కార్యాలయంలో డీపీఎంవోల పనితీరును సమీక్షించారు. జిల్లా వ్యాప్తంగా 34 కేసులు నిర్ధారించటం జరిగిందని, అనుమానితులను త్వరగా పరిశీలించి ఎక్కువ కేసులు నమోదయ్యేలా చూడాలని ఆదేశించారు. కొత్తగా కనుక్కున్న ప్రతికేసుకి పోకల్ లెప్రసీ క్యాంపెయిన్ జరిపించాలని ,వారి కుటుంబ సభ్యులకు ప్రోఫీలాక్సిస్ ట్రీట్మెంట్ ఇవ్వాలన్నారు. అనుమానితులు అందరినీ మెడికల్ ఆఫీసర్ నిర్ధారించి నికుష్ఠ్ యాప్‌లో అప్లోడ్ చేయాలని ఆదేశించారు . ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రిజిస్టర్ అండ్ రికార్డులను పరిశీలించాలని తెలియజేశారు. ప్రజలకు లెప్రసీ గురించి అవగాహన కల్పించాలని, శరీరం మీద రంగు మారిన మచ్చలు, కళ్ళు, కాళ్ల చేతులలో అంగవైకల్యం ఉన్నచో వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో చూపించాలని తెలియజేశారు. మచ్చ రూపంలో ఉన్నప్పుడే చికిత్స తీసుకుంటే అంగవైకల్యం రాకుండా చూసుకోవచ్చని తెలియజేశారు. తరచుగా సర్వేలు నిర్వహించడం వల్ల కేసులను త్వరగా నిర్ధారించి అంగవైకల్యం రాకుండా కాపాడుకోవచ్చునని తెలియజేశారు.